సాక్షి కర్నూలు

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



వీరభద్రుడికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: క్షేత్ర పాలకుడు బయలు వీరభద్రస్వామికి ఆదివారం అమావాస్య సందర్భంగా విశేష పూజలు జరిపించారు. మొత్తం 30 మంది భక్తులు పరోక్షసేవలో పాల్గొన్నారు.



అఫ్లియేషన్.. అంతా మాయ!

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జీఈడీ కళాశాలల అఫ్లియేషన్ గందరగోళంగా మారింది. లోపాయికారీ ఒప్పందంతో అఫ్లియేషన్ ప్రక్రియను ముగించేశారు.

IIలో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 11,430
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 11,276

న్యూస్‌రీల్

కోడుమూరులో లింగ నిర్ధారణ

- హాస్పిటల్‌ను సీజ్ చేసిన అధికారులు



మూతవేసిన ఆసుపత్రి వద్ద నోడల్ ఆఫీసర్లు

కోడుమూరు రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు కోడుమూరులో నిర్వహిస్తున్నట్లు ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన లింగనిర్ధారణ చట్టం నోడల్ ఆఫీసర్లు గుర్తించారు. బాషా హాస్పిటల్‌ను సీజ్ చేశారు. ఇరు రాష్ట్రాలకు చెందిన నోడల్ ఆఫీసర్లు, ప్రత్యేక వైద్య బృందం సభ్యులు ఆదివారం డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. ఓ గర్భవతిని హాస్పిటల్‌కు తీసుకువచ్చి లింగ నిర్ధారణ పరీక్షలు చేయాలని కోరారు. దీంతో హాస్పిటల్ సిబ్బంది లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. నోడలాఫీసర్లు రెడ్ హ్యాండెడ్‌గా సిబ్బందిని పట్టుకుని బాషా హాస్పిటల్‌ను సీజ్ చేశారు. తదుపరి విచారణకు ఆదేశించారు. ప్రజలెవ్వరూ వైద్య కోసం ఇక్కడికి రావద్దంటూ సూచించారు. కాగా.. కోడుమూరులో ఇద్దరు ఆర్ఎంపీలు ఇదే తంతు కొనసాగిస్తున్నారని, వారి క్లినిక్‌లపై కూడా దాడులు చేసి మూసివేయిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ శాఖ ఎస్ఈగా ప్రదీప్‌కుమార్



కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ శాఖ(ఏపీఎస్‌పీడీసీఎల్) కర్నూలు సర్కిల్ (ఆపరేషన్) సూపరింటెండెంటింగ్ ఇంజనీర్(ఎస్ఈ)గా ఆర్.ప్రదీప్ కుమార్‌ను నియమిస్తూ ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కే.సంతోష్‌రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం ఇక్కడే డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తుండగా పదోన్నతి కల్పించారు. ఖాళీ అవుతున్న డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలతో ఇక్కడే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఏ.శోభన్‌ప్రసాద్‌ను నియమించారు. ఎస్ఈగా ప్రదీప్‌కుమార్ సోమవారం విద్యుత్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

తేలికపాటి వానలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఆదివారం తేలికపాటి వర్షాలు కురిశాయి. మొత్తం 14 మండలా ల్లో వర్షపాతం నమోదైంది. గోనెగండ్లలో 46.2 మి.మీ. వర్షం కురిసింది. ఆస్పరి, కర్నూలు రూ రల్, కర్నూలు అర్బన్, కల్లూరు, ఎమ్మిగనూరు, ఓర్వకల్లు, కోడుమూరు, కౌతాళం, పత్తికొండ, గూడూరు, వెల్దుర్తి, దేవనకొండ, సి.బెళగల్‌లలో తేలికపాటి వానలు కురిశాయి. జిల్లా మొత్తం మీద సగటున 3.9 మిమీ వర్షపాతం నమోదైంది.

సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

కర్నూలు సిటీ: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో తగ్గంది. ప్రస్తుతం 12,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా రెండు గేట్ల ద్వారా 11,403 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కేసీ కెనాల్‌కు 2,286, తాగునీటికి 159 క్యూసెక్కులు వదలుతున్నారు.

చదువు కొనలేం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో పేరుకుపోయిన రూ.134 కోట్ల బకాయిలు
- 2023-24 పెండింగ్‌ను క్లియర్ చేయని కూటమి ప్రభుత్వం
- ఫీజుల జాప్యంతో మూతపడుతున్న కళాశాలలు
- కాలేజీలు మూసి వేస్తామని ఇప్పటికే అల్టిమేటం
- ఇప్పటికే మూతకు గురైన 44 కళాశాలలు

ఉన్నత విద్యాభ్యాసం చేసి, ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా ఉండాలనే పేద యువతీ, యువకుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తోంది. దీంతో కొన్ని కళాశాలలు మూతపడగా.. మరికొన్ని కాలేజీలు ఆదే బాటన పడుతున్నాయి. ఇలాగైతే చదువు 'కొనలేం' అని పేద విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





కర్నూలు(అర్బన్): కూటమి ప్రభుత్వ చర్యలతో విద్యారంగం అతలాకుతలమవుతోంది. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో తీవ్ర జాప్యం చేస్తుండటంతో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. విద్యార్థులపై ఒత్తిడి తీసుకు రాలేక మరికొన్ని కళాశాలలు మూతపడ్డాయి. ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ఈ నెల 21వ తేదీలోగా విడుదల చేయకపోతే కళాశాలలను మూసి వేస్తామని తాజాగా డిగ్రీ కళాశాలలకు చెందిన యాజమాన్యాలు అల్టిమేటం జారీ చేశాయి.

మాట మార్చిన 'కూటమి' నేతలు

అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఎలాంటి ఆటంకం కల్పించబోమని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు హామీ ఇచ్చారు. ఎప్పటికప్పుడు ఫీజులను విడుదల చేస్తామని ప్రతి సభలో చెప్పారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత గడచిన విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్ విడుదల చేయలేదు.

కళాశాలలను మూసి...

రాయలసీమ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలలకు ఈ నెల 21వ తేదీలోగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుంటే కళాశాలలను మూసివేసేందుకు కూడా వెనుకాడమని ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అల్టిమేటమ్‌ను జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే అసోసియేషన్ నేతలు యూనివర్శిటీ వైస్ చాన్సలర్ వీ వెంకటబసవరావుకు వినతి పత్రాన్ని అందించారు. కాగా.. గతంలో మొత్తం 112 డిగ్రీ కళాశాలలు ఉండగా, ప్రస్తుతం ఫీజు జాప్యం తదితర కారణాలతో 44 కళాశాలలు మూతకు గురి కాక, 68 కళాశాలలు మాత్రం కొనసాగుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి విద్యా సంవత్సరంలో నాలుగు విడతలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసింది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అదే ఏడాది మార్చి 2వ తేదీన మొదటి విడతగా జిల్లాలోని 35,618 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి రూ.23.95 కోట్లను అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జమ చేసింది.

➤ 2017-18, 2018-19 విద్యా సంవత్సరాల్లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019-20 విద్యా సంవత్సరంలో విడుదల చేసింది. అప్పట్లో జిల్లాలో 32,162 మంది విద్యార్థులకు సంబంధించిన అరియర్స్‌ను అందించారు. అలాగే కుటుంబ వార్షిక ఆదాయాన్ని కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.లక్షగా నిర్ధారిస్తే, వీలైనంత ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరాలనే సదుద్దేశ్యంతో జగన్ ప్రభుత్వం రూ.2.50 లక్షలకు పెంచింది.

ప్రస్తుతం దుస్థితి ఇదీ..

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో 2024లో మూడు విడతల ఫీజును కూటమి ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు చెల్లించాల్సిన మూడు క్వార్టర్ల ఫీజును పెండింగ్‌లో పెట్టింది.

➤ జిల్లాలో 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించి దాదాపు రూ.134 కోట్లు పెండింగ్‌లో పడ్డాయి. 2023-24కు సంబంధించి 31,596 మంది విద్యార్థులకు మూడు త్రైమాసికాలకు సంబంధించి దాదాపు రూ.89 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా, రూ.23 కోట్లు విడుదల చేసినట్లు చెబుతున్నారు. ఈ లెక్కన ఇంకా రూ.66 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికి 32,736 మంది విద్యార్థులకు ఇప్పటి వరకు దాదాపు రూ.110 కోట్లను విద్యార్థులకు చెల్లించాల్సి ఉండగా, రూ.42 కోట్లు చెల్లించామని చెబుతున్నారు. ఇంకా ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.68 కోట్లను బకాయి పెట్టారు.

జిల్లాలో కళాశాలల వివరాలు...

కళాశాలలు	మొత్తం	విద్యార్థుల సంఖ్య (రెన్యూవల్స్)
డిగ్రీ, బీఎడ్	68	9268
ఇంజినీరింగ్	21	9817
జీఎన్ఎం	12	900
మెడికల్ (ఎంబీబీఎస్, డెంటల్, ఫిజియోథెరపీ తదితర కోర్సులు)	30	2630
డైట్	01	105
ఫిషరీస్ కళాశాల	01	27
పాలిటెక్నిక్	12	1615
ఏపీ పారా మెడికల్ బోర్డు (ఒకేషనల్)	21	595
ఐటీఐ	17	1474

ఆర్థిక భారాన్ని తగ్గించి.. అండగా నిలిచి

గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టిన సమయంలో బీసీ, ఈబీసీ, మైనారిటీ, కాపు విద్యార్థుల ఇంజినీరింగ్ విద్యకు ఏడాదికి రూ.35 వేలు మాత్రమే విడుదలయ్యేవి. కానీ, కొన్ని పెద్ద కళాశాలల్లో (గ్రేడ్ -1) ఇంజినీరింగ్ ఫీజు ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఉంది. ఆయా కళాశాలల్లో చదువుతున్న సంబంధిత సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసే రూ.35 వేలను మినహాయించి మిగిలిన ఫీజు వారి తల్లిదండ్రులే చెల్లించాల్సి వచ్చేది. ఈ ఆర్థిక భారాన్ని కూడా తొలగించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచారు. దీంతో గ్రేడ్-1 కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారాన్ని కూడా తగ్గించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కింది.

శ్రీగిరిలో నేటి నుంచి దేవీశరన్నవరాత్రోత్సవాలు

- యాగశాల ప్రవేశంతో ఉత్సవాలకు అంకురార్పణ
- మొదటిరోజు శ్రీశైల భ్రామరీకి శైలపుత్రి అలంకారం
- భృంగివాహనంపై విహరించనున్న స్వామిఅమ్మవార్లు



ఉత్సవాలకు సిద్ధమైన ఆలయ మాడవీధులు

శ్రీశైలంటెంపుల్: విజయ దశమి సందర్భంగా శ్రీగిరి క్షేత్రంలో సోమవారం నుంచి అక్టోబర్ 2 వరకు భ్రమరాంబాదేవి శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈఓ ఎం.శ్రీనివాసరావు ఇటీవల అధికారులతో సమావేశమై భక్తులకు ఏలోటూ రానివ్వకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈఓ సూచనల మేరకు అధికారులు ఏర్పాట్లు అన్ని పూర్తి చేశారు. సంప్రదాయాన్ని అనుసరించి శాస్త్రోక్తంగా నిర్వహించబడే ఈ ఉత్సవాలలో అమ్మవారికి నవదుర్గ అలంకారాలు, ప్రత్యేక నవావరణపూజలు, స్వామిఅమ్మవార్లకు వాహనసేవలు, చండీయాగం, రుద్రయాగం జరుగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు స్వామిఅమ్మవార్లకు విశేష అర్చనలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, రుద్రయాగం, చండీయాగం, అమ్మవారి ఉత్సవమూర్తికి నవదుర్గ అలంకరణలు, స్వామిఅమ్మవార్లకు వివిధ వాహనసేవలు నిర్వహిస్తారు.

నేడు ఉత్సవాలకు అంకురార్పణ

దసరా మహోత్సవాలకు నాందిగా సోమవారం ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేస్తారు. గణపతి పంచాక్షరీ, కుంకుమార్చనలు, కుమారి పూజలు జరిపిస్తారు. ఉదయం 9.30 గంటలకు స్వామివారి యాగశాలలో యాగశాల ప్రవేశం చేసి వేదస్వసి , మహానివేదనలు జరిపిస్తారు. సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపన, రుద్రహోమం, అమ్మవారికి నవావరణార్చన, కుంకుమార్చనలు జరిపిస్తారు.

దసరా మహోత్సవాల్లో నేడు

దసరా మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు శ్రీశైల భ్రమరాంబాదేవి శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. అలాగే స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగివాహనంలో అధిష్టింపజేసి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

శ్రీమఠంలో భక్తుల సందడి



శ్రీమఠం ప్రాంగణంలో బంగారు పల్లకీ సేవ

మంత్రాలయం రూరల్: శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. అమావాస్య కావడంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక భక్తులు భారీగా వచ్చారు. తుంగభద్ర నదిలో పుణ్యసాన్నాలు ఆచరించి ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ దర్శనం చేసుకున్నారు. అనంతరం శ్రీరాఘవేంద్ర మూల బృందావనానికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల దర్శనార్థం శ్రీమఠం అధికారులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శ్రీమఠం ప్రాంగణంలో రాఘవేంద్రుల మూలబృందవన ప్రతిమను బంగారు పల్లికీలో కొలువుంచి భక్తజనం మధ్య ఊరేగించారు.



శ్రీమఠం కారిడార్‌లో భక్తుల కోలాహలం

కందిపప్పు.. కరువే!

- ఏడు నెలలుగా రేషన్ షాపులకు బ్యాళ్ల కేటాయింపులే లేవు
- బయటి మార్కెట్‌లో కిలో బ్యాళ్ల ధర రూ.180 పైమాటే
- కొనలేక ఇబ్బంది పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు
- ప్రస్తుతం రేషన్ షాపుల్లో ఇస్తున్నది బియ్యం, అరకొరగా జొన్నలు మాత్రమే!



కర్నూలు(సెంట్రల్): పేదలకు బియ్యం, బ్యాళ్లు, చక్కెర కచ్చితంగా ఇస్తామన్న పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ నోరు మెదపడంలేదు. కేవలం బియ్యం మాత్రమే ఇస్తూ బ్యాళ్లు అస్సలే ఇవ్వడంలేదు, అరకొరగా చక్కెర ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దసరా పండుగ వస్తున్న తరుణంలో బ్యాళ్లు ఇస్తారనుకుని ఆశించిన ప్రజలకు ఆశాభంగమే మిగిలింది. పండగ పూట కూడా కందిపప్పు కరువడంతో పరమాన్నం, భక్షభోజ్యాలకు పేదలు దూరం కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

16 నెలల్లో మూడు నెలలు మాత్రమే!

కర్నూలు జిల్లాలో 6,34,631 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 1 నుంచి 18వ తేదీల మధ్య రేషన్ షాపుల ద్వారా సరుకులను సరఫరా చేస్తున్నారు. ఒక్కో కార్డుకు కేజీ కందిపప్పు ఇవ్వాలని స్వయంగా మంత్రి ప్రమాణస్వీకారం చేసిన తరువాత మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. అయితే ఆయన ఆదేశాల తరువాత జిల్లాకు బ్యాళ్ల కేటాయింపులే జరగడంలేదు. జిల్లాకు దాదాపు 600 టన్నుల బ్యాళ్లను కేటాయించాలి. ప్రభుత్వం ప్రతి కార్డుకు కేజీ బ్యాళ్లను రూ.67లకు సరఫరా చేస్తుంది. ఈక్రమంలో ప్రభుత్వం బ్యాళ్లు లేకపోవడంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల బయటి మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది.అక్కడ కిలో ఏకంగా రూ.180పైగా ధర పలుకుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసే బ్యాళ్లను ఇవ్వకపోవడంతో బయటిమార్కెట్‌లో అధిక రేటుకు కొనుగోలు చేయలేక పేదలు, మధ్యతరగతి వర్గాల ప్రజలు పప్పుకు దూరమవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 16 నెలలు అవుతోంది. ఇందులో బ్యాళ్లను సరఫరా చేసింది మాత్రం కేవలం 3 నెలలు మాత్రమే!

అరకొరగా చక్కెర కేటాయింపులు

రేషన్‌షాపుల్లో ప్రతి కార్డుదారుడికి అర్ధకేజీ చెక్కరను రూ.17.50 లకు పౌర సరఫరాల సంస్థ సరఫరా చేస్తోంది. అయితే కార్డుకు కనీసం కేజీ చెక్కరైనా ఇవ్వాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకోవడంలేదు. కేవలం అర్ధ. కేజీ మాత్రమే ఇస్తుంది. అన్న అంత్యోదయ కార్డు దారులకు మాత్రం కేజీ చక్కెర చొప్పున సరఫరా ఇస్తారు. ప్రస్తుతం అక్టోబర్ నెలకు సంబంధించి జిల్లాకు 338 టన్నుల చక్కెర అందుబాటులో ఉంది.



రేషన్ షాపు నుంచి సరుకులు తీసుకుంటున్న ప్రజలు(ఫైల్)

జొన్నలు తీసుకోవడానికి ముందుకు రాని ప్రజలు

ప్రస్తుతం జిల్లాలోని రేషన్ కార్డుదారులకు కేవలం బియ్యం మాత్రమే రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తున్నారు. దాదాపు 10,500 టన్నుల బియ్యాన్ని కేటాయించారు. కాగా.. 1100 టన్నుల జొన్నలు ఉన్నా పేదలు, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీసుకోవడానికి ఇష్టపడంలేదు. జొన్నలు నాణ్యత పరంగా నాసిరకంగా ఉంటున్నాయనేది ప్రజల వాదన. కాగా, ఒక్కో కార్డుకు 2 లేదా 3 కేజీలు బియ్యానికి బదులుగా ఎలాంటి డబ్బులు తీసుకోకుండా జొన్నలను వినియోగదారులకు అందించాలి.

బ్యాళ్ల కేటాయింపులు లేవు



రేషన్‌కార్డుదారులకు అక్టోబర్‌కు సంబంధించి బ్యాళ్ల కేటాయింపులు జరుగలేదు. ఇది ప్రభుత్వ నిర్ణయం. జిల్లాకు 11వేల టన్నుల బియ్యం, 1,100 టన్నుల జొన్నల కేటాయింపులు జరిగాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు 338 టన్నుల చెక్కర అందుబాటులో ఉంది. ప్రజలు ఆయా నిత్యావసరాలను తీసుకొని సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకటరాముడు, డీఎం, సివిల్ సప్లై సంస్థ

కాసుల కోసం కక్కుర్తి!

- నకిలీ బయోల ద్వారా ఆదాయం కోసం వ్యవసాయ అధికారుల అడ్డదారులు
- అక్షయ్ అగ్రి సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉత్పత్తుల అమ్మకాలకు ప్రోత్సాహం
- లైసెన్స్ పొందిన డీలర్ల ద్వారానే నకిలీ బయోల మార్కెటింగ్
- వెల్లువెత్తుతున్న ఉమ్మడి గుంటూరు జిల్లా టీడీపీ నేత కంపెనీల ఉత్పత్తులు



పశ్చిమ ప్రాంతంలో హల్‌చల్ చేస్తున్న నకిలీ బయో ఉత్పత్తులు

కాసుల కోసం వ్యవసాయ అధికారులు కక్కుర్తి పడుతున్నారు. ఆదాయం కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. నకిలీ బయో ఉత్పత్తుల దారుడికి కొమ్ము కాస్తూ అతడు పడేసే ఎంగిలి మెతుకులకు దాసోహమవుతూ అన్నదాతలకు అన్యాయం చేస్తున్నారు. లైసెన్స్ డీలర్లతోనే నకిలీ బయో ఉత్పత్తులను రైతులకు అంటగట్టి ఆమ్యామ్యాలు పోగేసుకుంటున్నారు. అక్రమ సంపాదనలో వాటా ఉండటంతో ఈ తతంగమంతా తెలిసినా జిల్లా వ్యవసాయ యంత్రాంగం కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

కర్నూలు(అగ్రికల్చర్): నకిలీ బయో ఉత్పత్తులను అరికట్టాల్సిన వ్యవసాయ అధికారులే అక్రమ సంపాదన కోసం అడ్డుదారులు తొక్కుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది జూన్ నెలలో జరిగిన బదిలీల్లో కొందరు వ్యవసాయ అధికారులు కూటమి పార్టీల నేతలకు పెద్ద ఎత్తున ముడుపులు ఇచ్చుకొని కీలకస్థానాలు పొందారు. ఇటువంటి ఏఓలు ఇప్పటికే సంపాదన కోసం పలు మార్గాలను ఎంచుకున్నారు. కొందరు మరింత తెగబడి నకిలీ బయోల ద్వారా జేబులు నింపుకునేకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వ్యవసాయ అధికారుల తీరు చూస్తే కంచే చేను మేసినట్లు ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అక్షయ్ ఉత్పత్తులపై అంత ప్రేమ ఎందుకో..

బయోస్టిమిలింట్స్ ఉత్పత్తి, మార్కెటింగ్ కోసం ఫామ్-జి ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. రాష్ట్రం పరిధిలో ఉత్పత్తి మార్కెటింగ్ చేసుకునేందుకు ప్రభుత్వం ఫామ్-జీ2 ద్వారా అనుమతులు ఇస్తుంది. దేశంలో ఎక్కడైనా మార్కెటింగ్ చేసుకోవాలంటే కేంద్రం ఫామ్-జీ3 ద్వారా అనుమతి ఇస్తుంది. ఇప్పటికే జిల్లాలో ఎన్ని బయో స్టిమిలెంట్స్ కంపెనీలకు చెందిన ఎన్ని ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉందో.. ఆ వివరాలను వ్యవసాయ శాఖ జిల్లాకు పంపింది. ఆ వివరాల ప్రకారం జిల్లాలో 47 బయోస్టిమిలెంట్స్ కంపెనీలకు చెందిన 622 ఉత్పత్తులకు మాత్రమే మార్కెటింగ్ చేసుకునేందుకు అనుమతులున్నాయి. కానీ వివిధ మండలాల్లో అక్షయ్ అగ్రి సొల్యూషన్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఉత్పత్తులు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ కంపెనీకి చెందిన ఫ్లవర్ ప్లస్ అనే బయోలను వ్యవసాయ అధికారులే మార్కెటింగ్ చేయాలని డీలర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. పశ్చిమ ప్రాంతంలో కొందరు ఏఓలు ఐదారు కేసుల ఈ బయోలను సరఫరా చేసి లీటరు రూ.1,000 ప్రకారం వసూలు చేసిన, ఎంతకైనా అమ్ముకోవచ్చని ఉదారత చూపినట్లు సమాచారం . ఈ కంపెనీ ఉత్పత్తులపై వ్యవసాయ అధికారులకు అంత ప్రేమ ఏమిటోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులే ఈ బయో కంపెనీని నడుపుతున్నారా అనే అనుమానాలు కూడా రేకెత్తుతున్నాయి.

మా ఉత్పత్తులు అమ్మించండి

ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ నేత బయో కంపెనీలు జిల్లాలో హల్‌చల్ చేస్తున్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధి రెండు బయో కంపెనీలను నడుపుతున్నట్లు తెలుస్తోంది. 'ఇపుడు మా ప్రభుత్వం ఉంది. మా ఉత్పత్తులు అమ్మడానికి సహకరించండి. మీకు తగిన ప్రతిఫలం ఉంటుంది' అంటూ వ్యవసాయ అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. కొన్ని ఉత్పత్తులకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. మిగతా ఉత్పత్తులకు అనుమతులు లేవు. అయినా గ్రామాలు, మండలాల వారీగా ఏజెంట్లను నియమించుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్లి మార్కెటింగ్ చేయాలని, వ్యవసాయ అధికారులు కూడా సహకరిస్తారని, ఎవరితోనైనా ఇబ్బందులొస్తే తాము చూసుకుంటామని సదరు ప్రజాప్రతినిధి ఏజెంట్లకు చెబుతున్నట్లు సమాచారం. ఈ కంపెనీలకు కర్నూలులో ఉత్పత్తి లేదు. గుంటూరులోనే ఉత్పత్తి చేసి కర్నూలులోని గోదాములకు తరలించి మార్కెటింగ్ చేసుకుంటున్నారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం



యశోద (ఫైల్)

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమయ్యారు. గ్రామానికి చెందిన కోలు మధుశేఖర్ భార్య యశోద ఈనెల19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బేతంచెర్ల/పాణ్యం: సిమెంట్‌నగర్ సమీపంలోని క్రిష్ణమ్మ కోన–పాణ్యం రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు నంద్యాల రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్ తెలిపారు. వయస్సు 35 నుంచి 45 ఏళ్లలోపు ఉందని, ముదురు ఆకుపచ్చ నైట్‌ప్యాంట్ ధరించాడని, మృతదేహం పక్కన నల్లని టీషర్టు ఉందని తెలిపారు. మృతుని కుడి చేతికి 'నందిని ఉష' అనే పచ్చబొట్టు ఉందన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే 9440627653, 9490081633 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామ సమీపంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడి ఆరేళ్ల బాలిక మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపిన వివరాలు.. గడివేములకు చెందిన మాలాబీ, హుస్సేన్ బాషాల కుమార్తె అఫ్రిన్ (6) దసరా సెలవులకు బోధనం గ్రామానికి కుటుంబ సభ్యులతో బైక్‌పై బయలుదేరారు. ఘటనా స్థలంలో ప్రమాదవశాత్తూ కింద పడటంతో అఫ్రిన్ తలకు బలమైన గాయమైంది. తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సైట్ ఇంజినీర్ శవం లభ్యం



విజయ్‌కుమార్ (ఫైల్)

కోడుమూరు రూరల్: గూడూరు మండలంలోని సుంకేసుల డ్యాం వద్ద కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్టునందు సైట్ ఇంజినీర్‌గా పని చేస్తూ కన్పించకుండా పోయిన విజయ్‌కుమార్ (27) ఆదివారం శవంగా లభ్యమయ్యాడు. కర్నూలు నగరంలోని స్టాంటన్‌పురం కొట్టాల వద్ద ఉన్న కేసీ కెనాల్‌లో ఆదివారం మృతదేహం తేలియాడుతూ కన్పించడంతో తాలూకా అర్బన్ పోలీసులు అక్కడికి చేరుకుని ఒడ్డుకు చేర్చి ఆరా తీశారు. గూడూరు పీఎస్‌లో ఆచూకీ లేకుండా పోయిన సైట్ ఇంజినీర్ విజయ్‌కుమార్‌గా గుర్తించారు. నెల్లూరు జిల్లా గండ్లవీడు గ్రామానికి చెందిన విజయకుమార్ సుంకేసుల డ్యాం వద్ద కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్టులో సైట్ ఇంజినీర్‌గా పని చేస్తూ ఈనెల 17 నుంచి కన్పించడం లేదంటూ మేనమామ నాగేశ్వరరావు గత శుక్రవారం గూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆచూకీ కోసం గాలిస్తున్న వేళ విజయకుమార్ శవంగా లభ్యం కావడం సంచలనంగా మారింది. విజయ్‌కుమార్ మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

అఫ్లియేషన్.. అంతా మాయ!

- ఆర్‌యూ బీఎడ్ కళాశాలల అఫ్లియేషన్‌లో గందరగోళం
- ఎన్‌ఓసీలు తీసుకున్న బీఎడ్ కళాశాలలకు వర్సిటీ గుర్తింపు
- సొంత భవనాలు లేని కళాశాలలకు అఫ్లియేషన్
- ఎన్‌సీటీఈ క్లియరెన్స్ లేకుండానే ఎడ్‌సెట్ కౌన్సెలింగ్‌లో ఒక కళాశాల
- బీఈడీ కాలేజీలు ఉండేది ఒక చోట.. అడ్రస్ మరో చోట
- అనుమతి లేకుండానే విచ్చలవిడిగా ఉర్దూ అడ్మిషన్లు
- ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ పూర్తి కాకుండానే ఇతర రాష్ట్రాల విద్యార్థులతో అడ్మిషన్లు



ఆర్‌యూ పరిపాలనా భవనం

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ కళాశాలల అఫ్లియేషన్ అంతా గందరగోళంగా మారింది. వర్సిటీ అధికారులతో కొన్ని కళాశాలల యాజమాన్యాల లోపాయకారి ఒప్పందం, అఫ్లియేషన్ కమిటీలతో లాబీయింగ్, రాజ్‌విహార్ కూడలిలోని ఒక ప్రముఖ హోటల్‌లో కమిటీ సభ్యులు, యాజమాన్యాల రహస్య సమావేశం, అమ్యామ్యాల అప్పగింతలు వెరసి బీఈడీ కళాశాలలకు అఫ్లియేషన్ ప్రక్రియను ముగించేశారు. ఇందులో కొన్ని కళాశాలల పేర్లు పేపర్లలో మాత్రం అద్భుతంగా దర్శనమిస్తాయి. పేపర్లలో పొందుపరిచిన అడ్రస్‌లకు వెళితే మాత్రం ఫిజికల్‌గా అక్కడేమీ ఉండదు. ఆర్‌యూ పరిధిలో 2025–26 విద్యా సంవత్సరానికి 47 బీఈడీ కళాశాలలకు అఫ్లియేషన్ ఇచ్చారు. ఇందులో సుమారు 10 కళాశాలలు మాత్రం పేపర్లలో కనిపిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని కళాశాలలకు సొంత భవనాలు లేవు. ఎన్‌సీటీఈ క్లియరెన్స్ లేకుండానే ఎడ్‌సెట్ కౌన్సెలింగ్‌లో డోన్‌కు చెందిన ఒక కళాశాలకు అవకాశం ఇచ్చారు. బీఎడ్ కళాశాల ఏర్పాటుకు ఎన్‌సీటీఈ నుంచి ఏ అడ్రస్‌తో అయితే అప్రూవల్ తీసుకుంటామో అదే అడ్రస్‌లో కళాశాలల నిర్వహణ ఉండాలి. అడ్రస్ ఒక చోట, కళాశాల మరోచోట ఉంటోంది. అఫ్లియేషన్ కమిటీ వచ్చినప్పుడు తూతూ మంత్రంగా ఏదో ఒక బిల్డింగ్ (మల్టీపర్పస్ బిల్డింగ్ – బీఈడీ కళాశాలలకు సంబంధం లేనివి)ను చూపించి మమ అనిపించేస్తున్నారు. ఎన్‌సీటీఈ, న్యాయస్థానం, అఫ్లియేషన్ కమిటీల నివేదికల ప్రకారమే అఫ్లియేషన్ ఇచ్చినట్లు వర్సిటీ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ పూర్తి కాకుండానే ఇతర రాష్ట్రాల విద్యార్థులతో అడ్మిషన్లు చేసుకోవడం గమనార్హం. ఎన్‌సీటీఈ అనుమతి లేకుండానే విచ్చలవిడిగా ఉర్దూ అడ్మిషన్లు చేసుకుంటుండటం విస్తుగొలుపుతోంది. వీటిపై ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యా మండలి సమగ్ర విచారణ చేయిస్తే అఫ్లియేషన్ బండారం బయట పడుతుందని మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు అభిప్రాయ పడుతున్నారు.

ఎన్‌ఓసీ తంతూ..

ఆర్‌యూ నుంచి తప్పుకొని వేరే యూనివర్సిటీకి వెళ్లిపోతామని సుమారు 10 కళాశాలల యాజమాన్యాలు వర్సిటీ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ)లు తీసుకున్నారు. ఇందులో కొన్ని కళాశాలలకు సైతం అఫ్లియేషన్ ఇచ్చారు. వాటిల్లో విద్యార్థులు చేరుతున్నారు. ఎన్‌వోసీలు తీసుకున్న కళాశాలల యాజమాన్యాలు అఫ్లియేషన్‌కు ఫీజు కట్ట కూడదు. ఒక వేళ కళాశాలలు లైవ్‌లో ఉండేందుకు ఫీజు కట్టినా యూనివర్సిటీ అధికారులు సంబంధిత కళాశాలలకు అఫ్లియేషన్ కమిటీలను పంప కూడదు. పంపినా మేము ఎన్‌వోసీ తీసుకున్నాం, జీరో ఇయర్‌గా పాటిస్తున్నామని యాజమాన్యాలు లెటర్ ఇవ్వాలి. వర్సిటీ అధికారులు ఎలాంటి లెటర్‌లు తీసుకోకుండా అఫ్లియేషన్ ఇచ్చి కౌన్సెలింగ్‌కు అనుమతించారు. దీంతో విద్యార్థులు సంబంధిత కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం కళాశాల షిఫ్టింగ్ కాకపోయినా వచ్చే విద్యా సంవత్సరం కళాశాల వేరే వర్సిటీ పరిధిలోకి షిఫ్ట్ అయితే పరిస్థితి ఏంటో వర్సిటీ అధికారులకే తెలియాలి. ఎన్‌వోసీతో ఇప్పటికే వేరు వర్సిటీల పరిధిలోకి వెళ్లిపోయిన బీఈడీ కళాశాలల్లో చదివిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిస్థితి, కరస్పాండెన్స్ ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

న్యాయస్థానాన్ని ఆశ్రయించి..

ఎన్‌సీటీఈ వసతులు సరిగా లేని కళాశాలలకు పీపీఆర్ నోటీసు, విత్‌డ్రా నోటీసులు ఇచ్చింది. పబ్లిక్ హియరింగ్‌లో పీపీఆర్, విత్‌డ్రా నోటీసులు ఉన్న కళాశాలలకు వర్సిటీ అఫ్లియేషన్ కమిటీలు విజిట్ చేయ లేదు. దీంతో సంబంధిత యాజమాన్యాలు న్యాయ స్థానాలను ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు వర్సిటీ అధికారుల ఆయా కళాశాలలకు అఫ్లియేషన్ కమిటీలను ఇన్‌స్పెక్షన్‌కు పంపాయి. కమిటీ సభ్యులు వాస్తవ పరిస్థితిని నివేదికలో పొందుపరిస్తే అఫ్లియేషన్ ఇచ్చే పరిస్థితి ఉండదు. న్యాయ స్థానానికి ఎన్‌సీటీఈకి సైతం ఈ నివేదికను సమర్పించవచ్చు. ఇక్కడి దాకా పరిస్థితి రాదు. కానీ కమిటీలు తూతూ మంత్రంగా విజిట్ చేసి ఏవో కొన్ని రిమార్కులు పెట్టాయి. ఈ నివేదిక ప్రకారం కండిషనల్ అఫ్లియేషన్ ఇచ్చినట్లు తెలిసింది.

కమిటీలదే ప్రధాన పాత్ర..

వర్సిటీ పరిధిలోని కళాశాలలకు అఫ్లియేషన్ ఇవ్వడానికి అఫ్లియేషన్ కమిటీలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఈ కమిటీలు కళాశాలలను ఫిజికల్‌గా సందర్శించి ఎన్‌సీటీఈ నిబంధనలను పరిశీలించి సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించి వాస్తవ పరిస్థితి ఏంటో నివేదిక ఇవ్వాలి. ఈ నివేదిక ఆధారంగా మాత్రమే వర్సిటీ సీడీసీ విభాగం, వర్సిటీ ఉన్నతాధికారులు అఫ్లియేషన్ ఇస్తారు. అయితే యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్న కమిటీలను ఏర్పాటు చేయించుకొని కళాశాలలను తనిఖీ చేసేలా ఏర్పాట్లు చేసుకుని వ్యవహారం నడిపించారు. కమిటీ సభ్యులు ఎన్‌సీటీఈ నిబంధనలను కమిటీ సభ్యులు పరిశీలిస్తే సుమారు 15 కళాశాలలకు అఫ్లియేషన్ ఇచ్చే పరిస్థితి ఉండదని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

కమిటీల నివేదిక ఆధారంగానే..

బీఈడీ కళాశాలలు ఎక్కడున్నాయి, బిల్డింగ్‌లు, వసతులు ఉన్నాయా లేదా అనే విషయాలను అఫ్లియేషన్ కమిటీలు ఇన్‌స్పెక్షన్‌కు వెళ్లినప్పుడు పరిశీలిస్తాయి. ఆ కమిటీల నివేదికల ఆధారంగానే బీఈడీ కళాశాలలకు వర్సిటీ అఫ్లియేషన్ ఇచ్చాం. కమిటీల రిపోర్ట్‌ను కాదని ముందుకు వెళ్లే ప్రసక్తే లేదు. బీఈడీ కళాశాలలకు ఎన్‌వోసీ ఇచ్చినా ఎన్‌సీటీఈ నుంచి షిఫ్టింగ్ క్లియరెన్స్ వచ్చే వరకు ఆ కళాశాలలు మా పరిధిలోనే ఉంటాయి. విద్యా సంవత్సరం మధ్యలో ఎలాంటి షిఫ్టింగ్ చేయకూడదని ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. – డాక్టర్ విజయ కుమార్ నాయుడు, రిజిస్ట్రార్, ఆర్‌యూ



పరామర్శ

డాక్టర్ హరికృష్ణారెడ్డిని ఓదారుస్తున్న ఎస్వీ, కాటసాని

కర్నూలు(టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హరికృష్ణారెడ్డి కుటుంబాన్ని పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి పరామర్శించారు. ఈ నెల 20వ తేదీన రాత్రి డాక్టర్ హరికృష్ణారెడ్డి కుమారుడు హృషికేష్‌రెడ్డి స్థానిక గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్వీ, కాటసానితో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు సుంకేసుల రోడ్డులోని ఆయన నివాసానికి వెళ్లి పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం హరికృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దుర్ఘటన జరగడం బాధాకరమని పేర్కొంటూ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఐక్యంగా నంద్యాల అధ్యక్ష ఖండం అభివృద్ధి చేస్తాం

- బిషప్ సంతోష్ ప్రసన్నరావు



నిర్ధారణ ఇస్తున్న బిషప్ సంతోష్ ప్రసన్నరావు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ పరిధిలోని అన్ని సంఘాల ఐక్యమత్యంతో నంద్యాల అధ్యక్ష ఖండాన్ని అభివృద్ధి చేస్తానని ఆ ఖండం పీఠాధిపతులు, రైట్‌రెవరెండ్ బిషప్ సంతోష్ ప్రసన్నరావు అన్నారు. ఆదివారం హోలీక్రాస్ కెథడ్రల్ ఆలయ సమీపంలో నుంచి జ్ఞానాపురంలో ఉన్న పరిశుద్ధ మత్తయి ఆలయానికి ఊరేగింపుగా బిషప్‌ను తీసుకొచ్చారు. పరిశుద్ధ మత్తయి ఆలయం డీనరీ చైర్మన్ నందం ఐజక్ గురువులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన నిర్ధారణ కార్యక్రమంలో బిషప్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శాంతి, సమాధానం, ప్రేమాగుణంతో అందరి సహకారంతో నంద్యాల డయాసిస్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బిషప్‌గా బాధ్యతలు చేపట్టి నెలన్నర రోజులకే ముద్దనూరు పాస్టరేట్‌లో కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం బిషప్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్ రవీంద్ర గురువులు, పరిశుద్ధ మత్తయి ఆలయం కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న సీఐ

నందికొట్కూరు: పట్టణంలోని బీఎస్ఎస్ఆర్ నగర్‌లో గంజాయి విక్రయిస్తున్న యువకులను ఆదివారం సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1,100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌కు యువత బానిస కావద్దన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రత్యేక దృష్టితో గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో ఎస్ఐ చంద్రశేఖర్, పోలీసులు ఉన్నారు.

హత మార్చి.. మృతదేహాన్ని చెరువులో పూడ్చి!



పద్మనాభరెడ్డి (ఫైల్)

ప్యాపిలి/పత్తికొండ రూరల్: పత్తికొండ మండలం చక్రాళ్ల గ్రామానికి చెందిన పద్మనాభరెడ్డి (37) ని హత్య చేసి మృతదేహాన్ని ప్యాపిలి మండలం వెంగళాంపల్లి చెరువులో పూడ్చిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. పత్తికొండ సీఐ జయన్న, తహసీల్దార్ హుసేన్‌సాబ్, ప్యాపిలి ఎస్ఐ మధుసూదన్, అసిస్టెంట్ ఫోరెనిక్స్ అధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. హత్యకేసు నిందితులను అరెస్టు చేశారు. పత్తికొండ పోలీసు స్టేషన్‌లో సీఐ తెలిపిన వివరాల మేరకు.. గత మే నెలలో పద్మనాభ రెడ్డిని లంకాయపల్లి రాజశేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, జానకి, తిలక్‌వర్మారెడ్డి హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వారు కిరాయి హంతకులు గంప అయ్యన్న, రాజేశ్, ఎద్దులదొడ్డి శ్రీరాములు, ప్రసాద్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం కిరాయిహంతకులు పద్మనాభరెడ్డిని గత మే నెలలో హత్య చేసి వెంగళాంపల్లి చెరువులో పూడ్చిపెట్టారు. విషయం తెలియని పద్మనాభరెడ్డి భార్య శిరీష తన భర్త కనిపించడం లేదని అప్పట్లో పత్తికొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అనుమానితులను విచారించగా తాము చేసిన నేరాన్ని అంగీకరించారు. ఈ మేరకు వారు పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని చూపించగా పోలీసులు పద్మనాభరెడ్డి మృతదేహాన్ని వెలికి తీశారు. పూడ్చి పెట్టి నాలుగు నెలలు కావడంతో మృతదేహం పూర్తిగా అస్తిపంజరంగా మారింది.

ఊపిరితిత్తుల జబ్బులకు అత్యాధునిక వైద్యం



సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ వి.నాగార్జున, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ఊపిరితిత్తుల జబ్బులకు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందని యశోదా హాస్పిటల్ (హైదరాబాద్) సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్ వి.నాగార్జున మాటూరు అన్నారు. ఆదివారం స్థానిక ఓ హోటల్‌లో ప్రాంతీయ పల్మనాలజీ అప్‌డేట్–2025 పేరుతో వైద్య సదస్సు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి 250 మందికి పైగా వైద్యులు, వైద్య విద్యార్థులు హాజరయ్యారు. సీఎంఈ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ వి.నాగార్జున మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కాలుష్యం, అధిక జనాభా, వైరల్ ఇన్‌ఫెక్షన్ల కారణంగా ఊపిరితిత్తుల జబ్బులు పెరుగుతున్నాయని చెప్పారు. పల్మనాలజీ విభాగం, క్రిటికల్ కేర్ మెడిసిన్ రంగాల్లో కొత్త మందులు, సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించారు. క్లినికల్ ఇంర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ వెంకట్ రమణ కోలా మాట్లాడుతూ.. ఐసీయూలో వెంటిలేటర్ వినియోగం, ఎక్మో ద్వారా ఊపిరితిత్తులను, గుండెను ఎలా పనిచేయించాలో వివరించారు. వైద్యులు కుళ్లాయప్ప, శ్రీనివాసరెడ్డి, జి.సుబ్బారావు, నెమలి రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల్లో పటిష్ట భద్రత



మాట్లాడుతున్న ఆక్టోపస్ డీఎస్పీ జగ్గినాయుడు

మహానంది: రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు ఆక్టోపస్ డీఎస్పీ జగ్గినాయుడు తెలిపారు. మహానందిలో ఆలయ భద్రతపై ఆదివారం కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో సీసీ కెమెరాల నిఘా తప్పనిసరి అన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆలయాలు, భక్తుల భద్రతలో పోలీసులతో పాటు రెవెన్యూ, ఫైర్, ఇతర శాఖల అధికారుల పాత్ర ఉందన్నారు. రాత్రి 9.00 గంటల నుంచి మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలు, భక్తులు, స్థానికులకు అవగాహన కల్పించారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై నగీన

ఆళ్లగడ్డ: చదువుకోవటం ఇష్టంలేక ఇంటి నుంచి పారిపోయిన బాలుడు ఏడాది తరువాత ఆళ్లగడ్డ పట్టణ పోలీసుల సహకారంతో ఆదివారం తల్లిదండ్రుల చెంతకు చేరాడు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన కుందూరు బ్రహ్మానందరెడ్డి కొడుకు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. చదువుపై ఇష్టము లేకపోవడంతో పాఠశాలకు సక్రమంగా పోయేవాడు కాదు. తల్లిదండ్రుల తరుచు పాఠశాలకు వెళ్లాలని మందలిస్తుండటంతో గతేడాది ఇంటి నుంచి పారిపోయాడు. అప్పటి నుంచి కుమారుడి కోసం తల్లిదండ్రులు ఎంత గాలించినా ఆచూకి లభ్యం కాలేదు. అయితే గత రెండు రోజుల క్రితం ఓ సెల్‌ఫోన్ నుంచి తండ్రి బ్రహ్మానందరెడ్డి మొబైల్‌కు ఫోన్ చేసి తనకు ఇంటికి రావాలని ఉందని చెప్పి ఫోన్ కట్‌చేశాడు. వెంటనే వారు పట్టణ పోలీసులను ఆశ్రయించగా ఆ ఫోన్ ఎక్కడి నుంచి వచ్చిందని ఆరాతీయగా తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నుంచి వచ్చిందని తెలిసింది. దీంతో వెంటనే పట్టణ పోలీసులు అప్రమత్తమై పోలీస్ సిబ్బందిని పంపి బాలుడిని గుర్తించి ఆదివారం తల్లిదండ్రులకు అప్పగించారు.

15 అడుగుల ఆముదం చెట్టు

సాధారణంగా ఆముదం మొక్క పొలంలో ఆరు నుంచి 8 అడుగుల వరకు పెరిగి పంట పూర్తిగా కాగానే ఎండిపోతుంది. కానీ కృష్ణగిరి మండలం టి.గోకులపాడు గ్రామంలో తూము ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్ద రెండేళ్ల క్రితం వేసిన ఆముదం విత్తనం మొలకెత్తి ఏకంగా 15 అడుగుల ఎత్తు పెరిగింది. రెండేళ్లయినా ఎండిపోకపోవడంతోపాటు మానును తలపిస్తూ కాపు కాపు కాస్తుండటంతో గ్రామస్తులు ఆసక్తిగా చూస్తున్నారు. – కృష్ణగిరి



బస్సులు రాక.. ఇంటికి వెళ్లలేక!



ఫుట్‌బోర్డులో ప్రయాణం

కర్నూలు నగరం నుంచి గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం కర్నూలు బస్టాండ్‌లో బస్సులు లేకపోవడంతో వందలాదిమంది గంటల తరబడి వేచి ఉన్నారు. వచ్చిన అరకొర బస్సుల్లో సీట్లు లేక ప్రమాదకరస్థితిలో ఫుట్‌బోర్డులో ప్రయాణించాల్సి వచ్చింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



సీట్లు లేక బస్సు వద్ద నిలబడి ఉన్న మహిళలు



కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలు